క్లుప్తంగా

'మా నమ్మకం నువ్వే జగన్' కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సత్యవేడు: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం ×మా నమ్మకం నువ్వే జగన్‌÷ కార్యక్రమం కిట్లను మండల వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ బొప్పన సోమశేఖర్, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే. చంద్రశేఖర్ రెడ్డితో కలసి ఆయన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు ఎంపీ రవి, పునిదకుమార్, మునివేలు, మణి, మాణిక్యం, సుకన్య, చిన్నబ్బ, టెంకాయల కృష్ణయ్య, రాబిన్,, శ్రీధర్ పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



ధృవపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

శ్రీకాళహస్తి: సమాజసేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ బాలాజీనాయక్ అన్నారు. తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో ఉత్తీర్ణత సాధించిన బాబు అగ్రహారం మున్సిపల్ హైస్కూలుకు చెందిన 8మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ఆయన మంగళవారం ధృవ పత్రాలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర స్కౌట్స్ కౌన్సిల్ మెంబర్ టి.రమేష్‌బాబు, స్కౌట్ మాస్టర్ అజారుద్దీన్, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం



విరాళమిస్తున్న కృష్ణ

ఏర్పేడు: మండలంలోని కొత్తకాల్వలో గ్రామస్తులు నూతనంగా అంకమ్మ ఆలయం నిర్మించారు. వచ్చే వారం ఆలయ కుంభాభిషేక పూజ లు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ అన్నదానానికి రూ.10 వేలను ఆలయ నిర్వాహకులు హరినాథ్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డికి విరాళంగా అందజేశారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు

ఏర్పేడు: మండలంలోని డిక్సన్ కర్మాగారం సమీపంలోని పిల్లారిగుంట వద్ద ట్రాక్టర్‌తో ఇద్దరిని ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపిన వివరాలు..తిరుపతి జిల్లా, పుత్తూరు మండలం, తొర్రూరు పంచాయతీ ఆనంబట్టు గ్రామానికి చెందిన ఆర్ముగంరెడ్డి, తన కుమారుడు యుగంధర్, కోడలు స్వప్నతో కలిసి ద్విచక్ర వాహనంపై సోమవారం డిక్సన్ కర్మాగారానికి వెళ్లి వారిని ఉద్యోగంలో చేర్పించాడు. తిరిగి వారితో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా పిల్లారిగుంట వద్ద ఎదురుగా వస్తున్న ఏపీ 39 యూఈ 3448 ట్రాక్టర్ వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆర్ముగం రెడ్డి, యుగంధర్‌రెడ్డికి గాయాలయ్యాయి. చికిత్స కోసం రేణిగుంట బాలాజీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ ట్రాక్టర్‌తో పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశారు. డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లండి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఏపీటీఎఫ్ మండల నాయకులు మంగళవారం తొట్టంబేడు తహసీల్దార్ సుదీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సమస్యలను నివేదించారు. ఏపీటీఎఫ్ నాయకులు మునిరాజా, క్రిష్ణయ్య, పెరుమాళ్, బాలసుబ్రమణ్యం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లి మృతిపై కుమార్తెల ఫిర్యాదు

ఏర్పేడు : తల్లి మృతిపై కుమార్తెలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. ఏర్పేడుకు చెందిన సుబ్బమ్మ(75)కు కుమారుడు నాగయ్య, కుమార్తెలు అమ్మణమ్మ, మునెమ్మ, లోకమ్మ ఉన్నారు. కుమార్తెలకు వివాహమైంది. ఇటీవలే కుమార్తెలు వచ్చి తల్లిని చూసుకుని వెళ్లారు. ఈక్రమంలో 8 రోజుల క్రితం సుబ్బమ్మ అనుమానాస్పదంగా మృతి చెందింది. మృతదేహాన్ని చెత్త తరలించే బండిలో తీసుకెళ్లి గ్రీన్ అంబాసిడర్లే ఖననం చేశారు. ఈ విషయం తెలుసుకున్న కుమార్తెలు తమ తల్లి మృతదేహానికి పోస్టుమార్టం చేయించాలని ఫిర్యాదు చేశారు. తమ సోదరుడే తల్లిని హత్య చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేపట్టినట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

అమ్మవారికి తాళిబొట్టు సమర్పణ



శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయంలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి రూ.2లక్షల విలువైన బంగారు తాళిబొట్టును మంగళవారం చిత్తూరుకు చెందిన కాశీనాథస్, కుటుంబసభ్యులు వితరణగా అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను దాతలకు ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అందజేశారు. కార్యక్రమంలో జూలుగంటి మురళి పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



తొట్టంబేడు : సైక్లింగ్ చేస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

నారాయణవనం: దిన చర్యలో భాగంగా వ్యాయామంతో పాటు సైక్లింగ్‌తో ఆరోగ్యవంతంగా ఉండవచ్చని వైద్యాధికారులు దర్శిత్‌రాజ్, రాగసుధ తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తుంబూరు వెల్‌నెస్ సెంటర్‌లో మహిళలకు, విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం పిల్లలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. దర్శిత్‌రాజ్ మాట్లాడుతూ, రోజూ వ్యాయామానికి, సైకిల్ తొక్కడానికి 30 నిమిషాల సమయాన్ని కేటాయిస్తే ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పి జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ కాటమ్మ, ఆశా వర్కర్లు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొట్టంబేడులో..

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): వాతావరణ కాలుష్యం నివారణ, పర్యావరణ పరిరక్షణతోపాటు ఆరోగ్యంగా ఉండేందుకు సైక్లింగ్ దోహదం చేస్తుందని తొట్టంబేడు మండల ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ తేజేశ్వరి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి ఆదేశాల మేరకు సైక్లింగ్ మంగళవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బంది కలిసి సైక్లింగ్ నిర్వహించారు. సైక్లింగ్ వలన పలు ఉపయోగాలున్నాయని, రక్త ప్రసరణ బాగా జరిగి శరీరక్రియలు సక్రమంగా ఉంటాయని, ఎలాంటి రుగ్మతలు రావన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు, పీహెచ్ఎస్ సంపూర్ణ, ఉపాధాయులు, పీఈటీ వెంకటేష్, విద్యార్థులు, ఏఎస్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: క్రమం తప్పకుండా సైక్లింగ్ చేస్తే శరీర బరువును నియంత్రించుకోవచ్చని, అంతే కాకుండా మానసిక ఒత్తిళ్లు దూరమై ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యాధికారి దివాకర్ అన్నారు. మంగళవారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగ, నీర్పాకోటలో విద్యార్థులు, వైద్య సిబ్బందితో సైక్లింగ్ చేశారు. సైక్లింగ్ వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సైక్లింగ్ ప్రతి ఒక్కరి జీవన విధానంలో ఒక భాగం కావాలన్నారు. మంచి నిద్రకు దోహదం చేయడంతో పాటు రక్తపోటును అదుపులో ఉంచుతుందన్నారు.





నారాయణవనం : తుంబూరులో ర్యాలీలో వైద్య సిబ్బంది, విద్యార్థులు, బుచ్చినాయుడుకండ్రిగ: సైకిల్ తొక్కుతున్న వైద్యాధికారి దివాకర్

నేటి నుంచి వాహన సేవలు

-వివిధ వాహనాలపై స్వామి అమ్మవార్ల ఊరేగింపు



స్వామి అమ్మవారు ఊరేగనున్న వివిధ వాహనాలు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): శ్రీకాళహస్తీశ్వరాల బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం నుంచి వాహనసేవలు ప్రారంభం కానున్నాయి. వివిధ వాహనాలను అధిష్టించి స్వామి అమ్మవారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారు. తొలుత బుధవారం ఉదయం స్వామి సూర్యప్రభ వాహనంపై, అమ్మవారు చప్పర వాహనంపై ఊరేగుతారు. రాత్రి భూత-శుక వాహనాలను అధిరోహిస్తారు.

వాహన సేవలు

వారం	ఉదయం	రాత్రి
గురువారం	హంస- యాళి	రావణుడు-మయూర
శుక్రవారం	హంస-శుక	శేష-యాళి
శనివారం	ఇంద్రవిమానం-చప్పరం	నంది-సింహ
ఆదివారం	రథోత్సవం,	తెప్పోత్సవం
సోమవారం	అధికార నంది, కామధేను	గజ- సింహ
మంగళవారం	రుద్రాక్ష అంబారి	సభాపతి కళ్యాణం
బుధవారం	అశ్వ వాహనం	సింహ వాహనం
గురువారం	కేడిగం	వాహనసేవ
శుక్రవారం	......	పల్లకిసేవ
శనివారం	......	ఏకాంతసేవ

రానున్న సోమవారం కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహిస్తారు. అలాగే వచ్చే బుధవారం కైలాసగిరి ప్రదక్షిణ ఉంటుంది. ఆదివారం స్వామి అమ్మవారికి శాంతి అభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిమాప్తమవుతాయి

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలోని టీటీడీ అనుబంధ శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. తొలుత అర్చకులు, స్థానిక భక్తులు స్వామి అమ్మవార్లకు, ఆలయ ఆవరణ ప్రాంతాన్ని గంధం, పసుపు, కుంకుమ, పచ్చ కర్పూరం, సుగంధ ద్రవ్యాలను శుద్ధి చేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి విశేష అలంకరణ చేసి పూజార్చన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. - శ్రీకాళహస్తి రూరల్

పచ్చ బ్యాచ్‌కు మతిభ్రమించింది



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నారాయణవనం: అధికారంలోకి రాలేమనే నిస్పృహతో పచ్చ బ్యాచ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై అభాండాలు మోపుతోందని మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. యువగళం పాదయాత్ర ప్రారంభంలో అరువుకు తెచ్చుకున్న వారితో మాట్లాడించడం హాస్యాస్పదంగా ఉందని, పచ్చ కామర్లతో కళ్లు బైర్లు కమ్మి వాస్తవాలను చూడలేని స్థితిలో టీడీపీ నాయకులు ఉన్నారని ఎద్దేవా చేశారు. కృషి ఒకరిదైతే, తామే సాధించినట్లు చెప్పుకునే నీచ సంస్కృతి తమది కాదన్నారు. సత్యవేడులో శ్రీసిటీని ఏర్పాటు చేసి పారిశ్రామిక ప్రగతిని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పరుగులు తీయిస్తే, సొంత జిల్లాకు చంద్రబాబు ఏమీ చేయకపోగా స్వలాభం కోసం విజయా డెయిరీ, సహకార చక్కెర కార్మాగారాలను మూయించారనే విషయాన్ని విస్మరించి అవాకులు చెవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 నుంచి ఇప్పటి వరకు సత్యవేడు నియోజకవర్గంలో ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో బహిరంగ చర్చకు సిద్ధమేనా? అని సవాల్ విసిరారు. ప్రభుత్వం నుంచి అత్యధిక నిధులను రాబట్టి నియోజకవర్గాన్ని అన్నింటా అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని విమర్శిస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సొరకాయలు, సచివాలయ మండల కన్వీనర్ కోనేటి బాబు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, వైస్ ఎంపీపీ శివశంకర్, సర్పంచ్‌లు మురుగేశం, సుబ్రమణ్యంరెడ్డి, మండల కార్మిక విభాగం కన్వీనర్ అశోక్, నాయకులు గోపాల్, మనోహర్, చీరాలయ్య, అయ్యప్ప, బాల తదితరులు పాల్గొన్నారు.

రుద్రాక్ష చెట్టుకు పూజ

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల అంకురార్పణకు శ్రీకాళహస్తికి విచ్చేసిన భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంగాధర శాస్త్రి మంగళవారం హోటల్ ఎంజీఎం గ్రాండ్ ప్రాంగణంలో పండ్లతో ఉన్న రుద్రాక్ష చెట్టుకు ఎంజీఎం గ్రూప్ చైర్మన్ గుడ్లూరు మల్లికార్జున నాయుడుతో కలిసి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ, శ్రీకాళహస్తి క్షేత్ర సన్నిధిలో శివునికి ఎంతో ప్రీతిపాత్రమైన రుద్రాక్ష మొక్కలను పెంచి ఈరోజు వాటి ఫలాలను భక్తులకు ఉచితంగా అందజేయడంఎంతో పుణ్యకార్యమని, అలాగే తొలిసారి రుద్రాక్ష చెట్టును చూడగానే అనిర్వచనీయమైన అనుభూతికి గురైనట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలోఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్,చెంచు రామానాయుడు పాల్గొన్నారు.

'ఆస్పత్రిలో రక్త, మూత్ర పరీక్షలఫలితాలు వేగవంతం'

బుచ్చినాయుడుకండ్రిగ: రక్తం, మూత్ర పరీక్షల ఫలితాలు త్వరితగతిన పొందేందుకు ఉపయోగపడే ఆధునిక నిర్ధారణ ఉపకరణాలు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రారంభించినట్లు వైద్యాధికారిణి మాధవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో రక్తం, మూత్ర పరీక్షల కోసం కెమికల్, సూక్ష్మదర్శిని వాడటం వలన ఫలితాలు ఆలస్యమయ్యేవని, దీంతో రోగులు ఇబ్బంది పడేవారని తెలిపారు. ఈ నేపథ్యంలో బయో కెమిస్ట్రీ మెషినరీని తెప్పించి ఈ పరీక్షలకు ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. ఫలితాలు త్వరగా రావడమే కాకుండా అన్ని రకాల పరీక్షలు చేయవచ్చని, దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రమణ్యం, ల్యాబ్ టెక్నీషియన్ అమీషా తదితరులు పాల్గొన్నారు.


'యువగళం'..జేడీఆర్‌కు 'గరళం'!

వరదయ్యపాళెం: గత సార్వత్రిక ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన జేడీ రాజశేఖర్‌కు మంగళవారం నియోజకవర్గంలో జరిగిన యువగళం పాదయాత్రలో చేదు అనుభవం ఎదురైంది. పిచ్చాటూరు సమీపంలోని కీళ్లపూడి వద్ద నిర్వహించిన యువగళం బహిరంగ సభలో లోకేష్ కనీసం జేడీఆర్ పేరును ప్రస్తావించకపోగా.. ప్రచార రథంలో ముందున్న ఆయనను వెనక్కి పంపారు. తాజాగా ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించిన డాక్టర్ హెలెన్‌ను ప్రజలకు పరిచయం చేస్తూ ఆమెతో నారా లోకేష్ సెల్ఫీ దిగాడు. ఇన్నాళ్లు ఇన్‌చార్జ్‌గా చెప్పుకున్న జేడీఆర్‌కు ప్రచార రథంపై కనీస గౌరవం ఇవ్వకపోవడం, నాలుగేళ్లుగా నియోజకవర్గంలో టీడీపీ కోసం పనిచేస్తున్న తమ నాయకునికి ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై ఆయన వర్గీయులు కుతకుతమని ఉడికిపోయారు. 2019 ఎన్నికల్లో టీడీపీకి జేడీఆర్‌ను అభ్యర్థిగా నిలబెట్టి ఓటమి చెందిన తర్వాత పార్టీ అధిష్టానం అవకాశవాద రాజకీయాలు చేయడం సరికాదని చర్చించుకోవడం కనిపించింది.

జన సమీకరణకు అష్టకష్టాలు

సత్యవేడు నియోజకవర్గంలో యువగళం పాదయాత్రకు జన సమీకరణ కోసం ఆ పార్టీ నాయకులు అష్టకష్టాలు పడుతున్నారు. 7 మండలాల్లో టీడీపీ ముఖ్య నేతలు ఖర్చుకు వెనకాడుతూ ఎవరూ ముందుకు రావడం లేదు. తాజాగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలను తీసుకున్న డాక్టర్ హెలెన్, ఆమె తల్లి మాజీ ఎమ్మెల్యే హేమలత అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. మండలాల వారీగా పెద్ద మొత్తంలో నగదు పంపిణీ చేసి జన సమీకరణకు అష్టకష్టాలు పడుతున్నారు. మంగళవారం సాయంత్రం పిచ్చాటూరు మండలంలోని కీళ్లపూడి వద్ద నిర్వహించిన బహిరంగ సభ ప్రాంగణం 3వేల మంది జనాభా సామర్థ్యం కలిగిన ప్రదేశం నిండకపోవడమే జన సమీకరణకు కలిగిన ఇబ్బందులకు నిదర్శనం.

ఓటర్ల జాబితాలో తప్పిదాలకు తావివ్వొద్దు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి శ్రీనివాస్

నారాయణవనం: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా తయారీలో తప్పిదాలకు తావివ్వరాదని, పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఓటర్ల జాబితా సిద్ధం చేస్తే ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడానికి సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఏపీఐసీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నారాయణవనంలో బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రమీల నేతృత్వంలో నిర్వహించిన బీఎల్వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొరబాట్లు లేని ఓటర్ల జాబితను తయారు చేయాల్సిన బాధ్యత బీఎల్వోలపై ఉందని అన్నారు. అంకితభావంతో ఎన్నికల విధులను నిర్వర్తించాలన్నారు. ఓటర్ల జాబితాలో డూప్లికేట్లను తొలగించి, ప్రతి ఓటరు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్ఓ శ్రీధర్, సర్వేయర్ హేమాద్రి, మండలంలోని 36 పోలింగ్ కేంద్రాల బీఎల్వోలు పాల్గొన్నారు.

సైబర్ ల్యాబ్‌తో నేరాల కట్టడి



మాట్లాడుతున్న రవీంద్ర సన్నారెడ్డి, విమల కుమారి, నరసింహారావు

వరదయ్యపాళెం: తిరుపతిలోని అత్యాధునిక సైబర్ ల్యాబ్ ద్వారా అనేక నేరాలను కట్టడి చేసినట్లు ఏఎస్పీ విమల కుమారి తెలిపారు. మంగళవారం శ్రీసిటీలో సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ ద్వారా ఫిషింగ్ దాడుల నుంచి ఎలా తప్పించుకోవాలి, పని ప్రదేశాలు, ఇంటి వద్ద ఇంటర్నెట్‌ను ఎలా సురక్షితంగా ఉపయోగించాలన్న అంశాలపై అవగాహన పెంపొందించినట్లు వెల్లడించారు. సైబర్ పీస్ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ నరసింహారావు మాట్లాడుతూ సైబర్ బెదిరింపులు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహణకు శ్రీసిటీని ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సీఐ రామచంద్రారెడ్డి, శ్రీసిటీ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాంస్కృతికం.. సమ్మోహనం



ప్రవచన కార్యక్రమంలో మేడసాని మోహన్

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తీశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ధూర్జటి కళా ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. అష్టావధాన బ్రహ్మశ్రీ మేడసాని మోహన్ ప్రవచన కార్యక్రమానికి సభాప్రాంగణమంతా భక్తులతో నిండిపోయింది. వర్ధమాన సినీ హీరోయిన్, సినీ కొరియోగ్రాఫర్ మహతి భిక్షు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. చిన్నగొట్టిగల్లు మురళి భక్తి రంజని, పద్మశ్రీ ఘంటసాల కళాక్షేత్రం, సుంకర రవికుమార్ భక్తి రంజని భక్తులను అలరించాయి. చెన్నైకు చెందిన సుషోబాణం అకాడమీ ఆఫ్ క్లాసికల్ డ్యాన్స్, సీతాలక్ష్మి నృత్య ప్రదర్శన, తిరుపతికి చెందిన వాసవి కళానికేతన్ కేశవి నృత్య ప్రదర్శన, జ్యోతిర్మయి (కర్నూలు) నృత్య ప్రదర్శన, శ్రవణి (వైజాగ్)నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి.

చోరీ కేసులో ముద్దాయికి జైలు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : చోరీ కేసులో ముద్దాయికి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నరేంద్రరెడ్డి తీర్పు ఇచ్చారు. మంగళవారం ఈ మేరకు ఎస్ఐ రాఘవేంద్ర వివరాలు తెలిపారు. 2022 జూలైలో కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన మీనా ఇంట్లో 96 గ్రాములు అపహరించిన కేసులో ఒంగోలు జిల్లా చీరాలకు చెందిన దాసరి ముఖేష్(శ్రీను)ను అరెస్ట్ చేశామన్నారు. అప్పట్లో నిందితుడి నంచి 60 గ్రాముల బంగారం రికవరీ చేసినట్లు వెల్లడించారు. దీనిపై విచారించిన కోర్టు ముద్దాయికి జైలు శిక్ష విధించినట్లు వివరించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



ఏర్పేడు : పాపానాయుడుపేటలో..

బుచ్చినాయుడుకండ్రిగ: బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా జైలుశిక్ష, జరిమానా తప్పదని డిప్యూటీ తహసీల్దారు శివయ్య హెచ్చరించారు. మంగళవారం బాల్య వివాహాల నిర్మూలన పోస్టర్లను తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. డీటీ మాట్లాడుతూ, బాల్య వివాహాలు ఎక్కడైనా చేస్తే అడ్డుకోవాలని కోరారు. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటసుబ్బయ్య, యానాది సంఘం నాయకులు కోటయ్య, ఏపీఎం ఇందిరమ్మ, వెలుగు సీసీలు, సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి, ఏఎస్ఓ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో బతుకు బుగ్గి

ఏర్పేడు: బాల్యవివాహాలు చేస్తే బతుకు బుగ్గిపాలవుతుందని ఏఎస్ఐ ఉష అన్నారు. మంగళవారం మండలంలోని అంజిమేడులో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో బాల్యవివాహాలు చేస్తున్న పక్షంలో సమష్టి కృషితో నిరోధించాలని ఏఎస్ఐ పిలుపునిచ్చారు. అలాగే ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పాపానాయుడుపేట జెడ్పీ హైస్కూలులో కూడా అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాతేకాల్వ మోహన్‌రెడ్డి, ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, గ్రామ మహిళా కార్యదర్శి పద్మావతి, ప్రగతి సంస్థ ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల కన్వీనర్లు శిరీష, రామచంద్రయ్య, పాపానాయుడుపేట క్లస్టర్ కన్వీనర్ సుబోస్ చంద్రయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుకునే ప్రాయంలో పుస్తెల భారం వద్దు

శ్రీకాళహస్తి రూరల్: చదువుకునే ప్రాయంలో పుస్తెల భారం వద్దని ప్రగతి మండల కో-ఆర్డినేటర్ రామచంద్రయ్య అన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై మంగళవారం మండలంలోని బీవీపురం జెడ్పీ హైస్కూలు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలసి బీవీపురం, గొల్లపల్లె, దళితకాలనీ, ఎస్టీ కాలనీల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్ల వివాహోత్సవంలో బాల్య వివాహాలు చేయడం స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, తాతేకాల్వ శివారెడ్డి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: బాల కార్మిక, వెట్టిచాకిరీ వ్యవస్థలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యాయవాదులు కోరారు. 'ఆపరేషన్ స్వేచ్ఛ'కార్యక్రమంలో భాగంగా బాల కార్మిక నిర్మూలన, వెట్టిచాకిరీ వ్యవస్థను నిర్మూలనకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో శ్రీరామ్‌నగర్ కాలనీలోని భవిత పాఠశాలలకు అవగాహన కార్యక్రమం అనంతరం ర్యాలీ నిర్వహించారు. అలాగే తొట్టంబేడు మండలం జ్ఞానమ్మకండ్రిగలో ఇసుక బట్టీలలో బాల కార్మికులపై ఆరా తీశారు. బాల కార్మికులతో పనులు చేయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, రెండవ పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్, అసిస్టెంట్ లేబరాఫీసర్ రంగనాథ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పేడు : అంజిమేడులో..



బుచ్చినాయుడికండ్రిగ :బాల్య వివాహాల నిర్మూలన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీటీ తదితరులు



శ్రీకాళహస్తి రూరల్‌లో..